క్లుప్తంగా



ఏఎస్‌బీఎల్ సీఈవో అజితేష్ కొరుపోలు శనివారం హెచ్ఐసీసీలోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఈటీ ఎక్సలెన్స్ అవార్డ్స్‌–23 కార్యక్రమంలో గవర్నర్ తమిళసై చేతుల మీదుగా ఎమర్జింగ్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్‌–23 అవార్డును అందుకున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 60, పచ్చిమిర్చి100, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 70, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 160 ప్రకారం ధర పలుకుతున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీజేఆర్‌నగర్, రిలయన్స్ సెంట్రో ఎదురుగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

● బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మూడోసారి ప్రభుత్వం అధికారంలోకి రావాలని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తిరుగులేని ఆధిక్యత సాధించి మూడోసారి కూడా అధికారం రావాలని శ్రీరాముడిని కోరుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సీఎం రాకతో నూతనోత్సాహం

జిన్నారం(పటాన్‌చెరు): సీఎం రాకతో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొందని జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారన్నారు. సీఎం సభను విజయవతం చేయటంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు.

అలరించిన గజల్స్

మాదాపూర్: బాలీవుడ్ సింగర్ హరిహరన్ గజల్ కచేరీతో నగరవాసులను విశేషంగా అలరించారు. మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో మాహిర్ పేరుతో గజల్ కచేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల సినిమా పాటలను సైతం పాడారు.

వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చూడాలి

రాయదుర్గం: రోడ్లపై ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి ఎస్ఈ శంకర్‌నాయక్ అధికారులకు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ముందు రోడ్డు నుంచి ఖాజాగూడ ప్రధాన రోడ్డు మలుపు వరకు ఉన్న రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో రోడ్డుపై ఎక్కడా వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వర్షపునీరంతా నాలాలు, వరద నీటి కాలువలు, మురుగు కాలువల్లోకి సాఫీగా వెళ్లేలా అన్ని చోట్లా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శేరిలింగంపల్లి ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్ష్మీ, ఏఈ జగదీశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీటీం లక్ష్యం

పటాన్‌చెరు టౌన్: మహిళల భద్రతే షీటీం లక్ష్యమని డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు మహిళా సంఘాల నాయకులు డీఎస్పీగా పదోన్నతి పొందిన వేణుగోపాల్ రెడ్డితో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం షీ టీమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఏదైనా సమస్య ఉంటే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తల్లులు తమ పిల్లలపై దృష్టి సారించాలని, వారు ఏమి చేస్తున్నారో గమనిస్తూ ఉండాలన్నారు. అనంతరం డీఎస్పీగా పదోన్నతి పొందిన వేణుగోపాల్ రెడ్డిని సత్కరించారు. పటాన్‌చెరు మహిళా సంఘాల ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మీల్స్ కొస్తే.. చలాన్ల మోత

● జీహెచ్‌ఎంసీ భోజన కేంద్రం వద్ద పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు
● ప్రతి రోజు 2000 భోజనాలు, 500లకు పైగా వాహనాలు రోడ్డుపైనే..
● ఖాళీ ప్రదేశాలలో పార్క్ చేయాలంటున్న ట్రాఫిక్ పోలీసులు



మాదాపూర్‌లో జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తున్న మధ్యాహ్నం రూ.5ల భోజనం వద్ద రోడ్డుపై నిలిపిన వాహనదారులు

మాదాపూర్: రూ.5 భోజనానికి వెళితే వందల రూపాయల వాహన చలాన్‌లు పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మాదాపూర్‌లో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన రూ.5 మధ్యాహ్న భోజన కేంద్రం వద్ద పార్కింగ్ అవకాశం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను పెట్టి భోజనానికి వెలుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో ఫిర్యాదులు చేస్తుండడంతో ట్రాఫిక్ అధికారులు ఫొటోలు తీసి చలానాలను ఇంటికి పంపుతున్నారని పలువురు వాపోతున్నారు.

◆ చిరు వ్యాపారులు, ఆటో, క్యాబ్ డ్రైవర్లు , చిన్న ఉద్యోగులకు రూ.5 మధ్యాహ్న భోజనం వరంగా మారింది.

◆ ప్రధాన రహదారి పక్కనే భోజన కేంద్రం ఏర్పాటు చేయడంతో పార్కింగ్ సమస్య నెలకొంది. వాహనాలను ప్రధాన రోడ్డుపైనే నిలపాల్సి వస్తుంది.

◆ కూర్చుని తినేందుకు ఏర్పాట్లు చేసినప్పటికి పరిసరాల్లో వాహనాలను ఎక్కడ నిలపాలో తెలియక ఇబ్బందులుపడుతున్నారు.

◆ రోజు దాదాపు 2000 ప్లేట్లు సరఫరా చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

◆ గతంలో నిలబడడానికి వీలులేకుండా ఉండేది. ప్రస్తుతం తాగేందుకు నీరు, కుర్చీలు ఏర్పాటు చేశారు.

◆ కాగా ఐటీ ప్రాంతం కావడంతో వీవీపీలు ఎక్కువగా తిరుగుతూ ఉంటారు. రోడ్లపై పార్కింగ్‌తో సమస్య నెలకొంటోంది.

◆ దీంతో ట్రాఫిక్ పోలీసులు ద్విచక్ర వాహనాలు, ఆటోలకు రూ100 నుంచి రూ.200 చలాన్లు ..క్యాబ్‌లకు రూ.200 నుంచి 2000ల వరకు విధిస్తున్నారు.





భోజనం చేస్తున్న వ్యక్తులు

ఎక్కడ పడితే అక్కడ నిలపరాదు

భోజన కేంద్రానికి ప్రతి రోజు కొత్తవారు వస్తుంటారు కాబట్టి వారికి సమాచారాన్ని అందించేందుకు నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేస్తాం. వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలపరాదు. ఆ ప్రాంతంలోని ఖాళీ ప్రదేశాలలో పార్క్ చేసి రావాలి. చాలాసార్లు సమాచారం అందించాము.

–ట్రాఫిక్ సిఐ నర్సయ్య

చుట్టుపక్కల ఖాళీ స్థలం లేదు



పార్కింగ్ చేసేందుకు ఖాళీ స్థలం లేకపోవడంతో రోడ్డుపై పెట్టాల్సి వస్తుంది. దీంతో చలాన్‌లను వేస్తున్నారు. పరిసర ప్రాంతాలలో తక్కువ ధరకు భోజనం లేదు. రూ.5 భోజనం చేసేందుకు చాలామంది వస్తున్నారు. చిరు వ్యాపారులు, ఉద్యోగులు ఇక్కడకు వస్తున్నారు. కార్యాలయానికి వెళ్ళేందుకు ఆలస్యం అవుతుందని రోడ్డు పక్కన వాహనాలను నిలపాల్సి వస్తుంది.

–రవి, ఆటోడ్రైవర్

హెచ్‌సీయూ వీసీని కలిసిన ఎన్ఎస్‌యూఐ బృందం



వీసీ ప్రొఫెసర్ బీజేరావుతో ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావును నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) హెచ్‌సీయూ నూతన కార్యవర్గ సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందం శనివారం కలిసింది. ఈ సందర్భంగా హెచ్‌సీయూలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా హెచ్‌సీయూ భూ ఆక్రమణలు, క్యాంపస్‌లో క్రీడా సౌకర్యాలు మెరుగుపర్చడం అవసరమని పేర్కొన్నారు. యూనివర్సిటీ అడ్మిషన్స్‌కి అప్లికేషన్ ఫీజు తగ్గించడం అంశాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. క్యాంపస్‌లోని అటవీ ప్రాంతాన్ని పరిరక్షించి జింకల మరణాలు పూర్తిగా తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా అకడమిక్ యూనిట్లను తూర్పు క్యాంపస్‌కు మార్చడంపై కూడా తగిన విద్యార్థులకు న్యాయం చేసేలా చూడాలని కోరారు. వీసీని కలిసిన వారిలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు షరీఫ్, ప్రధాన కార్యదర్శులు అజయ్, రచన, ఉపాధ్యక్షుడు అంజన్ పాల్గొన్నారు.

విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న టీఎస్ఎస్‌పీడీసీఎల్ సిబ్బంది

గచ్చిబౌలి: సమీక్షా సమావేశంలో తిట్టడమే కాకుండా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ టీఎస్ఎస్‌పీడీసీఎల్ గచ్చిబౌలి డీఈ గోపాల కృష్ణ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగామని యూనియన్ నాయకులు తెలిపారు. శనివారం లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, జేఎల్ఎం, పీఎంఆర్, జెఏఓ, సీనియర్ అసిస్టెంట్లు విధులు బహిష్కరించారని చెప్పారు. తారానగర్ సబ్ స్టేషన్ పరిధిలో జి.వెంకట్ రెడ్డి లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారని, ముగ్గురు లైన్‌మెన్ల పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో బిల్లుల కలెక్షన్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 22న గచ్చిబౌలి డీఈ గోపాలకృష్ణ సెక్సెస్ రివ్యూ నిర్వహించారని పేర్కొన్నారు. బిల్లుల కలెక్షన్ల విషయంలో మాట్లాడుతుండగా వెంకట్‌రెడ్డిని తిట్టడంతో మనస్తాపనికి గురై సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారని తెలిపారు. 23న వెంకట్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈ గోపాలకృష్ణ ఆర్డర్ ఇవ్వడంతో 11024,327 యూనియన్లు, ఎస్‌సీఎస్‌టీ అసొసియేషన్, సీఐటీయూ సంఘాలు విధులు బహిష్కరించి ధర్నాకు దిగారు. బేషరతుగా సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జేవీ రామ్మోహన్, శ్యామ్ సుందర్, గోపాల్, శ్రీను, నర్సయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

మాదాపూర్: కళాకారులు చేసిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సృజన జాతీయ నృత్యోత్సవాలను నిర్వహించారు. డాక్టర్ సోతాబ్ది ఆచార్య గౌడియా నృత్యం, శ్రీహరి మంగళంపల్లి బృందం భరతనాట్యం, కంకణ సింగ్ మణిపురి నృత్యం, కుమిడిని బృందం లావని నృత్యం, పరంపరకు బృందం గెడి నృత్యం, శ్రీకాంత్ గౌడ్ రాజస్థానీ నృత్యంలను ప్రదర్శించి అలరించారు. రిత్విక్‌వెంకట్, ఛార్మిలా వెంకట్ సింహనందిని నృత్యం, పేరిణీ సందీప్ బృందం పేరిణి లాస్యం నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ వేణుగోపాల చారి, తెలుగు యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ఆవుల మంజులత, చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అఖిల్ దడి, ఆర్టిస్ట్ శ్రవంతి జూలూరి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు పెంచాలి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య

పటాన్‌చెరు: రాష్ట్రంలో కనీస వేతనాలు వెంటనే పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో జరిగిన సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా కనీస వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాల కోసం కార్మికులంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వచ్చే నెలలో కలెక్టరేట్ ముట్టడి, ధర్నాలు నిర్వహించడం జరుగుతుందని, కార్మికులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

పటాన్‌చెరు టౌన్:క్రీడాకారులను ప్రోత్సహించాలని కార్పొరేటర్ కుమార్ యాదవ్ అన్నారు. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాస్ కుమారుడు హన్మంత్ కుమార్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో హన్మంత్ కుమార్‌ను కార్పొరేటర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జూలై 1వ తేదీన హర్యానాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్లనున్న హన్మంత్ కుమార్‌కు ప్రయాణ ఖర్చులకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం డివిజన్‌లోని గొల్లబస్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్లు, మ్యాన్ హోల్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సెల్ఫ్ రిపోర్ట్ చేయకుంటే సీటును కోల్పోతారు

పటాన్‌చెరు: కళాశాలలో సెల్ఫ్ రిపోర్ట్ చేయకుంటే సీటును కోల్పోతారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్స్ అండ్ బీఎస్సీ ఫిజికల్ సైన్స్ మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు 25వ తేదీలోపు సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని, రిపోర్టింగ్ చేయని విద్యార్థులు తమ సీటును కోల్పోతారన్నారు. రెండో విడతలో దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు 26వ తేదీ చివరి గడువు అని, వెబ్ ఆప్షన్ గడువు 27వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. మరింత సమాచారానికి కళాశాలలో హెల్ప్ లైన్ సెంటర్‌లో హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పూనంను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచే టీ–9 గోల్ఫ్ చాలెంజ్ టోర్నీ



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో యువ గోల్ఫర్లను ప్రోత్సహించేందుకు టీ గోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న టీ–9 చాలెంజ్ టోర్నీ రెండో ఎడిషన్ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొంటున్నాయి. దీనికి సంబంధించి ట్రోఫీని టీ గోల్ఫ్ ఫౌండర్ ఎస్ఆర్ఎన్ రెడ్డి, మాజీ క్రికెటర్లు చాముండి, వెంకటపతిరాజు, టోర్నీలో ఆడుతున్న జట్ల కెప్టెన్లతో కలిసి ఆవిష్కరించారు. 3 వారాల పాటు 9 రౌండ్లలో టోర్నీ జరగనుండగా... మొదటి 4 స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్ ఆడతాయి. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలతో పాటు రూ. 10 లక్షల ప్రైజ్‌మనీ దక్కనుంది. బౌల్డర్ హిల్స్ టైగర్స్ టీమ్‌కు మాజీ క్రికెటర్ చాముండి ఓనర్‌గా ఉండగా.. రైడర్స్, బౌల్డర్ నంజాస్, ఎకోలాస్టిక్ ఈగల్స్, జాగృతి జాగర్స్, నోవాటెల్ స్టార్స్, సిమెట్రిక్స్, టీజీఎఫ్ బ్యాక్ స్పిన్నర్స్ జట్లు పాల్గొంటున్నాయి. క్రికెట్‌లో టీ ట్వంటీ ఫార్మాట్ తరహాలోనే టీ9 ఛాలెంజ్ నిర్వహిస్తున్నట్టు టీ గోల్ఫ్ ఫౌండర్ ఎస్ఆర్ఎన్ రెడ్డి చెప్పారు. తొలి ఎడిషన్‌లో బౌల్డర్ హిల్స్ టైగర్స్ విజేతగా నిలిచింది.

హోప్ ఫౌండేషన్ సేవలు భేష్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హోప్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం చందనగర్‌లోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లికి చెందిన నలుగురు విద్యార్థులకు స్కూల్ ఫీజుల నిమిత్తం లక్ష రూపాయాల చెక్కును చైర్మన్ కొండ విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేద విద్యార్థులు రిషి, భార్గవి, మహేందర్, రిషితలకు హోప్ ఫౌండేషన్ చేయూతనందించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు వారం రోజుల్లో కనీసం 3 నుంచి 4 గంటల పాటు యోగా చేయాలన్నారు. క్రీడల్లో క్రమశిక్షణతో రాణించే విధంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు గౌతమ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, శేఖర్, జ్ఞానేశ్వర్, మహిపాల్ రెడ్డి, మారం వెంకట్, నూకల సందీప్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో బీజేపీ నేతల పాదయాత్ర



మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్

మాదాపూర్: కొద్ది పాటి వర్షాలకే రోడ్లన్నీ జలమయమవుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ పేర్కొన్నాడు. మాదాపూర్‌లోని ఇజ్జత్‌నగర్, ఖానామెట్‌లలో శనివారం గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహా సంపర్క్ అభియాన్‌లో బాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు అందిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సుందరీకరణ పేరుతో మొండికుంట చెరువును కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు నరసింహయాదవ్, రాధాకృష్ణయాదవ్, మల్లేష్, కృష్ణ, గోపాల్, మదనాచారి, మధుయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య, బాలునాయక్, విష్ణు, నరేష్, రవి, కుర్మయ్య, శ్రీనివాసరెడ్డి, శివయాదవ్, పద్మ, భారతి, స్వప్న, చంద్రకళ, నాగులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విద్యార్థులకు అవగాహన అవసరం

ఇండియన్ ఐడల్ విజేత, ప్రముఖగాయకుడు రేవంత్



విద్యార్థులతో ప్రముఖ సింగర్ రేవంత్

రాయదుర్గం: అన్ని రంగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఇండియన్ ఐడల్ విజేత, ప్రముఖ గాయకుడు రేవంత్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలో ప్రముఖ స్టార్టప్ 'వాట్ ఈజ్ మై గోల్' ఆధ్వర్యంలో శనివారం అండర్‌–18 సింగర్స్ ఈ కమ్యూనిటీని ఇండియన్ ఐడల్ విజేత, ప్రముఖ గాయకుడు ఎల్.వి. రేవంత్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్కూల్ పిల్లలతో ఇంటరాక్ట్ కావడం సంతోషంగా ఉందన్నారు. వాట్ ఈజ్ మై గోల్ స్టార్టప్ సహ వ్యవస్థాపకురాలు చిత్రలేఖ శర్మ మాట్లాడుతూ... విద్యార్థులు విభిన్న అనుభవాలను పొందగలిగేలా, కీలకమైన రంగాలలో దృష్టి సారించేలా చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు రోబొటిక్స్, ద్విచక్ర వాహన ప్రదర్శన, అవగాహన కల్పించారు. అనంతరం రేవంత్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేడుకగా జగన్నాథ రథయాత్ర



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: మియాపూర్ డివిజన్ ఆల్విన్‌–ఎక్స్ రోడ్డు ప్రధాన రహదారిపై ఇస్కాన్ హరే రామ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర వేడుకగా జరిగింది. రథయాత్రలో ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి పాల్గొన్న ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హఫీజ్‌పేట డివిజన్ నేత బాలింగ్ గౌతమ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రావు, బాబ్జీ, ఖాలి దిండి రోజా, సుప్రజ, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో కళాకారులు అన్నమయ్యకీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. ప్రతి శనివారం అన్నమాస్వరార్చనలో భాగంగా కొమ్మూరి రాజేశ్వరీ శిష్య బృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. శ్రీమత్త్వదియ చరితామృత, గురుప్రార్థనతో ప్రారంభించి దేవా నమో దేవా, కలిగెను ఇది నాకు కైవల్యము, బ్రహ్మమొక్కటే, అలివేలు మంగ, ఏమని పొగడుదునే వంటి బహుళ ప్రాచుర్యం పొందిన సంకీర్తనలను ఆలపించి అలరించారు. కళాకారులు మర్రిపూడి ప్రభ, బి.విజయలక్ష్మి, పుష్పలత, ఎం.హరిప్రియ, గాయత్రి అంజన, బి.విజయ్, కె.స్వప్న ఆలపించారు. తబలా భూమేష్, కీబోర్డు మూరుతి కిరణ్ వాయిద్య సహకారన్ని అందించారు. డాక్టర్ శోభరాజు మాట్లాడుతూ... అన్నమయ్య కీర్తనలు మంత్రాలు వాటిని నేర్చుకుని తన వంతుగా సంకీర్తనలను అందరికి నేర్పుతుందని తన శిష్యురాలైన కొమ్మూరి రాజేశ్వరిని అభినందించారు.

చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి

పటాన్‌చెరు టౌన్: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని, ఆ బాధ్యతను న్యాయ విద్యార్థులు స్వీకరించాలని సంగారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి హనుమంత్ రావు అన్నారు. మహిళలపై యాసిడ్ దాడులకు సంబంధించి శనివారం పటాన్‌చెరు మండలం ముత్తంగి లోని విశ్వ భారతి లా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న యాసిడ్ దాడులు, దౌర్జన్యాలపై ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తున్నా మహిళలపై దాడులు ఆగడం లేదన్నారు. సమాజంలో మహిళల భద్రతకు అందరూ చొరవ తీసుకొని అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం న్యాయ విద్యార్థులు హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీభవాని, అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.